కులగణనకు బిజెపి వ్యతిరేకం

- పరిపాలనా ఇబ్బందుల పేర నిరుపేదలకు అన్యాయం
- 'ఇండియా' కూటమి సమర్థన
- ఎస్‌వికె వెబినార్‌లో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో కులగణన చేయడానికి కేంద్రంలోని బిజెపి సర్కారు వ్యతిరేకిస్తున్నదని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు విమర్శించారు. తద్వారా నిరుపేదల సమస్యల పరిష్కారాన్ని అడ్డుకుంటున్నదని వ్యాఖ్యానించారు. ఇందుకు పరిపాలనా పరమైన ఇబ్బందులు, అడ్డంకులను సాకుగా చూపిస్తున్నదని నిరసించారు. కులగణనను 'ఇండియా' కూటమిలోని పార్టీలన్నీ సమర్థించాయని తెలిపారు. వచ్చే జనాభా లెక్కల సందర్భంగా కులగణన సైతం జరగాలని డిమాండ్ చేశారు. ఇందుకు రాష్ట్రాలకు బదులు కేంద్రమే చొరవ తీసుకోవాలని సూచించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన 'కులగణన-ఆవశ్యకత' వెబినార్‌లో రాఘవులు మాట్లాడారు. ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. కులగణన చేయడం ద్వారా సామాజిక రుగ్మతలను గుర్తించి సరిచేయడానికి వీలవుతుందన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కులగణనను వ్యతిరేకిస్తున్నాయనీ, ఇందుకు వాళ్లు చెబుతున్న కారణాలు సహేతుకంగా లేవన్నారు. కులగణన చేయలేమని సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో కేంద్రం పేర్కొందనీ, అందుకు పరిపాలనపరమైన సమస్యలు వస్తాయని అందులో పేర్కొందని వివరించారు. సాధారణ జనాభా లెక్కల సందర్భంగా అనేక తప్పులు వచ్చాయనీ, మొత్తంగా కులగణన చేస్తే ఇంకా ఎక్కువ సమస్యలు ఉత్పన్నమవుతాయని వివరించారు. 125 కోట్ల జనాభా లెక్కలు సేకరించినప్పుడు, 1.25 కోట్ల తప్పులు వచ్చాయనీ కేంద్రం చెబుతున్నదన్నారు. సంబంధిత వ్యవస్థలు, వ్యక్తులతో సంప్రదింపులు, చర్చల ద్వారా ఆ తప్పులను సరిదిద్దుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆ తప్పుల పేర అసలు కులగణనే చేయలేమని చెప్పడం సమాజం పట్ల నిర్వహించాల్సిన బాధ్యత నుంచి తప్పుకోవడమేనని తప్పుబట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా తప్పులను తగ్గించే అనేక అవకాశాలు ఉండగా, వాటిని వినియోగించుకోకుండా కులగణన సాధ్యం కాదని చెప్పడం సామాజిక తరగతుల పట్ల వివక్ష చూపడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పేదలకు సంబంధించిన విషయాలు,నిజాలను కప్పిపుచ్చడమేనని చెప్పారు. పెట్టుబడిదారి విధానంలో వెట్టి విధానం బలపడుతుందన్నారు. కులాలకు సంబంధించి కచ్చితమైన సంఖ్య ఉంటే రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలుచేయడానికి వీలవుతుందన్నారు. సామాజిక న్యాయం ఊహాజనితం కాకుండా, ఆచరణసాధ్యం కావాలని తెలిపారు. కులగణన ద్వారా ఉత్పన్నమయ్యే పరిస్థితులను సమస్యలుగా భావించడం సరికాదన్నారు. కులగణనతో ముందుకొచ్చే అంశాలను నిజాలు, వాస్తవాలుగా భావించి వాటిని అధిగమించే ప్రయత్నం చేయాలని సూచించారు. రాజకీయాలు, ఓట్ల అవసరాల కోసం నేడు నిర్ణయాలు జరుగుతున్నాయని చెప్పారు. అయితే అవి ఆచరణలో ఫలితాలను ఇవ్వడం లేదన్నారు. కోర్టులు సైతం గణాంకాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటాయనీ, ఆ మేరకే తీర్పులు ఇస్తాయని చెప్పారు. రిజర్వేషన్లకు 50 శాతం సీలింగ్ విధించడం సరికాదనీ, దాన్ని ఎత్తేయాలని డిమాండ్ చేశారు. శాస్త్రీయ ప్రాతిపదికగా రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. సామాజిక న్యాయాన్ని అమలు చేయాలంటే కులగణన చాలా అవసరమన్నారు. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు తేవాల్సిన అవసరమూ ఉందన్నారు. కులగణన ఒక్కటే సమాజంలోని పరిస్థితులను సాంతం మార్చే యలేదని వివరించారు. బీహార్‌లో కులగణన జరిగిందన్నారు.

వెబినార్‌లో మాట్లాడుతున్న బివి రాఘవులు

హైదరాబాద్‌లో హవాలా దందా

- రూ.18 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో హవాలా దందాను టాస్క్ ఫోర్సు పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి రూ.18 లక్షలతో పాటు ద్విచక్ర వాహనం, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. శని వారం టాస్క్‌ఫోర్సు డిసిపి పి.రాధా కిషన్‌రావు మీడియాకు వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన సవాయి శర్మ కొన్నేండ్ల కిందట ట్రాన్స్‌పోర్టు వ్యాపారం కోసం హైదరాబాద్‌కు వచ్చాడు. రామ్‌కోటిలో నివాసముంటున్న అతనికి వ్యాపారంలో నష్టాలు రావడంతో హవాలా రూపంలో డబ్బులు సరఫరా చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో కేరళ రాష్ట్రానికి చెందిన హవాలా ఏజెంట్ మనీష్‌ను సంప్రదించాడు. అతని సహాయంతో రూ.0.5 నుంచి 0.8 కమీషన్‌పై హవాలా దందా కొనసాగిస్తున్నాడు. మెసేజ్‌లు, వాట్సాప్ సమాచారంతోపాటు ఆన్‌లైన్ ద్వారా దందా చేస్తున్నాడు. సమాచారం అందుకున్న సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు శర్మను అరెస్టు చేశారు. తదుపరి విచారణ కోసం బేగంబజార్ పోలీసులకు అప్పగించారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్, ఎస్‌ఐలు ఎస్.సాయికిరణ్, సిహెచ్ నవీన్ కుమార్ ఉన్నారు.

ప్రవల్లిక మరణంపై ఆధారాలు చూపాలి : కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ అశోక్‌నగర్‌లో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న ప్రవల్లిక ఆత్మహత్యపై పోలీసులు ఏ ప్రాతిపదికన ఆరోపణలు చేస్తున్నారో వెల్లడించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పోలీసులు తమ దగ్గర ఉన్న ఆధారాలు బయటపెట్టాలని కోరారు. పరీక్షలు వాయిదా పడటంతో మనస్తాపానికి గురై ఆమె ఆత్మహత్య చేసుకుందని కుటుంబసభ్యులు చెప్పారని గుర్తు చేశారు. శనివారంనాడిక్కడి బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రవల్లికకు సంఘీభావంగా స్వచ్ఛందంగా యువత కదిలి వచ్చారనీ, ప్రభుత్వంపై ఏ స్థాయిలో వ్యతిరేకత ఉందో ఈ ఘటనను చూస్తే అర్థమవుతుందన్నారు. లక్షలాది మంది యువత జీవితాలతో ఆడుకుంటున్న టీఎస్‌పీఎస్సీని రద్దు చేయకుండా ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు.

డబ్బు కట్టడిపై ఇసి నజర్

- సరిహద్దు రాష్ట్రాల అధికారులతో నిఘా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్వరలో జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బు ప్రవాహానికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఇసి చర్యలు చేపడుతోంది. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో నగదు ప్రవాహాన్ని అడ్డుకోవడంలో అధికారులు విఫలమైనారని బాహాటంగానే అసహనం వ్యక్తం చేసిన సిఇసి..ఇప్పుడు దానిపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. ఇంటెలిజెన్స్ వ్యవస్థను మరింత విస్తృతం చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం వ్యూహరచన చేస్తోంది. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలను రంగంలోకి దింపింది. వాటికి అనుబంధంగా నిఘా వ్యవస్థలు పనిచేస్తున్నాయి. రాష్ట్రంలో 2018 ఎన్నికల సమయంలో రూ.98 కోట్ల విలువ చేసే మద్యం, బంగారం, నగదును స్వాధీనం చేసుకోగా.. ఈసారి ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాలుగు రోజుల వ్యవధిలోనే తనిఖీల్లో రూ.37 కోట్ల విలువ చేసే నగదు, బంగారం తదితరాలను అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో డబ్బు కట్టడికి మరిన్ని ఇంటెలిజెన్స్ వర్గాలను రంగంలోకి దింపేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. రాష్ట్రంలో ఇలా ఏర్పాటు చేసే ప్రత్యేక నిఘా వ్యవస్థను నేరుగా ఢిల్లీలోని ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం నిర్వాచన్ భవన్‌కు అనుసంధానం చేసేందుకు ఉన్న అవకాశాలను సైతం అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆ నిఘా సమాచారాన్ని అక్కడి నుంచి క్షేత్రస్థాయికి పంపి చర్యలు చేపట్టాలనేది వ్యూహంగా ఉంది. అలానే ఆర్థిక, సాధారణ, పోలీసు పరిశీలకులతో అనుసంధానం చేయడం ద్వారా కొన్ని అంశాల్లో తక్షణ చర్యలకు అవకాశం ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పెద్ద సంఖ్యలో నిఘా అధికారులను సమకూర్చుకోవడంపై మేధోమథనం చేస్తున్నారు. ఎన్నికలు జరిగే అయిదు రాష్ట్రాలను మినహాయించి ఇతర రాష్ట్రాల నుంచి నిఘా వర్గాలను సమీకరించేందుకు ఉన్న అవకాశాలను ఇసి పరిశీలిస్తున్నట్లు తెలిసింది. రాష్ట్రానికి పరిశీలకులను కేటాయించిన పరిసర రాష్ట్రాల నుంచి నిఘా వర్గాలను ఎంపిక చేయాలా? రాష్ట్రానికి సరిహద్దున ఉన్న రాష్ట్రాల నుంచి ఎంపిక చేయాలా? అన్న అంశంపై సిఇసి ఆరా తీస్తుంది. రాష్ట్రానికి పంపే ఆర్థిక, ఇతర పరిశీలకుల ఎంపికలోనూ సిఇసి విస్తృతస్థాయిలో కసరత్తు చేసింది. త్వరలో ఆయా పరిశీలకులు రాష్ట్రానికి రానున్నారు.

పగలు ఎండ... రాత్రి ఉక్కపోత

- అక్టోబర్‌లో మారిన వాతావరణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భగభగమంటున్నాయి. సాధారణంగా చలికాలంలో క్రమంగా తగ్గాల్సిన ఉష్ణోగ్రతలు వేసవిని తలపిస్తున్నాయి. అక్టోబర్ నెలలో వాతావరణం గతానికి భిన్నంగా ఉంది. పగటిపూట ఎండలు, రాత్రి వేళ ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ప్రస్తుతం నైరుతి సీజన్ ముగిసి, ఈశాన్య రుతుపవనాల ప్రవేశానికి పరిస్థితులు అనుకూలిస్తుంటాయి. ఇంకా ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించనప్పటికీ సాధారణంగా ఈ పాటికి వాతావరణం చల్లబడుతుంది. కానీ, రాష్ట్రంలో మాత్రం అందుకు భిన్నమైన వాతావరణం కనిపిస్తున్నది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సాధారణానికి మించి 3-5 డిగ్రీల సెల్సియస్ వరకు అధికంగా నమోదు అవుతూ, వేసవి సీజన్‌ను తలపిస్తున్నది. వాతావరణంలో తేమ తగ్గడంతో ఉక్కపోత పెరుగుతుండగా, ఆకాశం మేఘాలు లేకుండా నిర్మలంగా ఉంటుండటంతో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. రాష్ట్రంలో నైరుతి తిరోగమన ప్రక్రియ చివరి దశలో ఉంది. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల నుంచి రుతుపవనాలు పూర్తిస్థాయిలో తిరోగమించాయి. మరో వారం రోజులకు ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించవచ్చని అంచనా వేసింది. ఈ క్రమంలో వాతావరణంలో మార్పు లు ఉంటాయని, దీంతో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కావచ్చని పేర్కొన్నది. రానున్న మూడు రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణమే ఉంటుందని వాతావరణశాఖ వెల్లడించింది.

నేడు కాంగ్రెస్ తొలి జాబితా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితాను అధిష్ఠానం ఆదివారం విడుదల చేస్తుందని ఆ పార్టీ స్క్రీనింగ్ కమిటీ ఛైర్మన్ మురళీధరన్ తెలిపారు. 58 మంది పేర్లతో తొలి జాబితా ఉంటుందని వెల్లడించారు. చర్చలు జరుగుతున్నాయని, మరో రెండు రోజుల్లో మిగతా స్థానాలకూ అభ్యర్థులను ఖరారు చేస్తామన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేసేలా నిర్ణయాలు ఉంటాయని మురళీధరన్ స్పష్టం చేశారు. వామపక్షాలతో పొత్తుపై చర్చలు కూడా తుది దశలో ఉన్నాయన్నారు. అభ్యర్థుల ఎంపిక విషయంలో.. విజయావకాశానికి తొలి ప్రాధాన్యత, విధేయతకు రెండో ప్రాధాన్యత ఇచ్చామన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి, నేతలకే అవకాశం ఇచ్చామని, అన్ని మతాలు, కులాలకు కాంగ్రెస్ అధిష్ఠానం ప్రాధాన్యత ఇస్తుందని మురళీధరన్ పేర్కొన్నారు.

48గంటల్లోగా నివేదిక ఇవ్వండి

- సిఎస్, డిజిపిలకు గవర్నర్ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-2 అభ్యర్థిని ప్రవళిక (23) ఆత్మహత్యపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శనివారం స్పందించారు. ఆమె మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రవళిక మృతిపై 48 గంటల్లోగా నివేదిక ఇవ్వాలని సిఎస్, డిజిపి, టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శిని గవర్నర్ ఆదేశించారు. మృతురాలి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మరోవైపు, పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువత ఎదుర్కొంటున్న సవాళ్లు, లోనవుతున్న ఒత్తిళ్లను ప్రవళిక మరణం మరోసారి గుర్తు చేస్తోందని గవర్నర్ తెలిపారు. నిరుద్యోగ యువత నిరాశకులోను కావద్దని, ఉపాధి వేటలో ధైర్యంగా ముందుకెళ్లాలని కోరారు. యువతకు తన పూర్తి మద్దతు ఉంటుందని, ఉద్యోగ లక్ష్య సాధనలో వారికి పూర్తి అండగా నిలుస్తామన్నారు.

శాస్త్ర రంగంలో భగవంతం సేవలు చిరస్మరణీయం

- ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్

ప్రజాశక్తి-కల్చరల్

సూరి భగవంతం తెలుగు జాతికి వన్నె తెచ్చిన మహోన్నత వ్యక్తని, దేశ శాస్త్ర రంగంలో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ కొనియాడారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై డాక్టర్ సూరి భగవంతం ఫౌండేషన్, గాన సభ నిర్వహణలో ఆయన 114వ జయంతి వేడుకలు శనివారం జరిగాయి. ముఖ్య అతిథిగా డాక్టర్ లక్ష్మణ్ పాల్గొని న్యూ ఎరా ప్రిన్సిపల్ డాక్టర్ శ్రవణ్ కుమార్‌ను, ఇస్రో శాస్త్రవేత్త బత్తులూరి మహేంద్రనాథ్‌లను భగవంతం ప్రతిభాపురస్కారాలు బహూకరించి మాట్లాడారు. భగవంతం ఉస్మానియా యూనివర్శిటీ ఉపాధ్యక్షునిగా రెండు పర్యాయాలు పని చేసి శాస్త్ర పరిశోధనలను ప్రోత్సహించారని తెలిపారు. డిఆర్‌డిఒ వ్యవస్థాపనలో కీలక పాత్ర పోషించారని అన్నారు. అబ్దుల్ కలాం వంటి వారు ఆయన ప్రతిభను కొనియాడారని గుర్తు చేశారు. సభకు అధ్యక్షత వహించిన సీనియర్ పాత్రికేయుడు జి.వల్లీశ్వర్ మాట్లాడుతూ.. భగవంతం శాస్త్ర రంగంలోనూ, అధ్యాత్మిక రంగంలోనూ తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. పురస్కార గ్రహీత డాక్టర్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. సూరి భగవంతం జీవితం నేటి యువతకు ఆదర్శం కావాలని కోరారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి మాట్లాడుతూ సూరి భగవంతం జయంతి ప్రతి ఏటా గాన సభ నిర్వహణలో జరుపుతామని తెలిపారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు సూరి రామ్ స్వాగతం పలికిన సభలో ట్రస్ట్.ఛైర్మన్ డాక్టర్ సి.ఎస్.అర్.ప్రభు, విశ్రాంత సైనికాధికారి జి.శ్రీనివాస్‌పాల్గొన్నారు.

సూరి భగవతం జయంతి వేడుకలో పాల్గొన్న లక్ష్మణ్

సేద్యాన్ని సంక్షోభంలోకి నెట్టిన బిజెపి

- అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజ్జుకృష్ణన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని దివాలా తీయించిందని, సంక్షోభంలోకి నెట్టేస్తోందని అఖిలభారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజ్జుకృష్ణన్ అన్నారు. ఆయన శనివారం నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల సరిహద్దు యానగుంది దగ్గర విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తోన్న ఆర్థిక విధానాల కారణంగా వ్యవసాయ రంగం కుదేలవుతోందన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే నల్ల చట్టాలను తెచ్చారని, రైతాంగం పెద్దఎత్తున పోరాటం చేయడం వల్ల వెనక్కి తగ్గారని చెప్పారు. ప్రధానమంత్రి దిగొచ్చి రైతులకు క్షమాపణ చెప్పి నల్ల చట్టాలను వెనక్కి తీసుకుంటామని ప్రకటన చేశారని గుర్తు చేశారు. ఆ ఉద్యమ సమయంలో రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రైతులకు ఇచ్చిన హామీలను ఆయన నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఇచ్చే సబ్సిడీలను ఎత్తేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ మార్కెట్లను ప్రయివేట్ వాళ్లకు అప్పజెప్పడానికి పూనుకుందన్నారు. పెరిగిన సాగు ఖర్చుల వల్ల రైతులు పెట్టుబడులు పెట్టలేక.. పంట దిగుబడులు లేక ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగం మేల్కొని కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య, మాజీ వైస్ ఎంపీపీ మహేష్ కుమార్, ముస్తాపేట్ సర్పంచి లాలప్ప, నాయకులు ప్రకాశ్, గోవిందు, దొబ్బలి మల్లేష్, గోపాల్, బాలరాజ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF MACTCUM
III ADDL CHIEF JUDGE
CITY CIVIL COURT
AT: HYDERABAD, TELANGANA
O.P.NO 865 OF 2020

Between:
D.Ajay Kumar
...Prtitioner
AND
S.Pratap Reddy & Others
...Respondents

To.,
1. Anantha Ram Reddy Meka, S/o Net Known Petitioners, Age: Major, Occ: Tipper Lorry Previous Owner, R/o: 42-792/G1 Block, Fsp Nagar, Moulali, Hydearabad-500040.
...R3

Where the above named Petitioners have filed the above O.P. against you and another for grant of compensation under M.V Act.

Please take notice that the above O.P. stands posted to 16-10-2023 for your appearence you are required to appear Hon'ble Court at 10.30 am an the above date either in person or through an advocate, failiong which the matter will be decided exparte

//BY ORDER OF THE COURT//

C.SATISHKUMAR REDDY
ADVOCATE
Plot no: 36-1#3-125/36
Shanthinagar Colony, Uppal,
Hyderabad-39

ప్రేమ వ్యవహారమే కారణం

- ప్రవళిక పోటీ పరీక్షలు రాయలేదు
- సెంట్రల్ జోన్ డిసిపి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

ప్రవళిక ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని హైదరాబాద్ సెంట్రల్ జోన్ డిసిపి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆమె ఇప్పటివరకు ఎటువంటి పోటీ పరీక్షలు రాయలేదని చెప్పారు. శనివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడారు. ప్రవళిక 15 రోజుల క్రితమే హాస్టల్‌లో చేరిందని చెప్పారు. ఆమె ఆత్మహత్య చేసుకున్న రూమ్‌లో సూసైడ్ నోట్ దొరికిందని తెలిపారు. ఆమె ఫోన్, సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. శివరామ్ రాథోడ్‌తో ప్రవళిక చాటింగ్ జరిపినట్లు ఆధారాలు లభించాయని డిసిపి తెలిపారు. ప్రవళిక ప్రేమ వ్యవహారం ఆమె తల్లిదండ్రులకు కూడా తెలుసునని చెప్పారు. శివరామ్ రాథోడ్‌కు మరో యువతితో ఎంగేజ్ మెంట్ అయిందన్నారు. ప్రవళిక సూసైడ్ నోటును పరీక్షించేందుకు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామని, నివేదిక ఆధారంగా శివరామ్ రాథోడ్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రవళిక ఆత్మహత్యపై తప్పుడు ఆరోపణలు ప్రచారం చేయొద్దని డిసిపి కోరారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిసిపి వెంకటేశ్వర్లు

బతుకు పండుగ బతుకమ్మ

- రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన సంబురాలు

ప్రజావక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమైన బతుకమ్మ పండుగ వేడుకలు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. పట్నం, పల్లె తేడా లేకుండా రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. సూర్యాపేటలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతిబింబమన్నారు. ప్రపంచంలో అనేక జాతులు ఉన్నా, ప్రకృతిని ఆరాధించే ఏకైక జాతి తెలంగాణ జాతి అన్నారు. మధ్యలో కొంత నిరాదారణకు గురైన బతుకమ్మ పండుగను ఇంటికి ఇంటికి చేర్చిన ఘనత తెలంగాణ ఉద్యమానిదే అన్నారు. రాష్ట్ర సాధనలో ప్రజలను ఏకం చేయడంలో బతుకమ్మ పండుగ ప్రముఖ పాత్ర వహించింది అన్నారు. బతుకమ్మ పండుగ వేడుకలు తొమ్మిది రోజులు జరగనున్నాయి.

'కోడ్'తో నెమ్మదించిన అభివృద్ధి పనులు

- ఎన్నికల తర్వాతే అంటున్న అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో అభివృద్ధి పనులు ప్రభావం పడుతోంది. దీనికితోడు దసరా పండగ కూడా తోడవడంతో క్యాంపుల్లోని సిబ్బంది, కార్మికులు సొంతూర్లకు పయనమవుతున్నారు. దాంతో.. పైవంతెనలు, నాలా, రోడ్ల నిర్మాణ పనుల రోజువారీ పురోగతి నెమ్మదించింది. తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్‌లోనూ ఎన్నికలు ఉండటంతో.. ఆ రాష్ట్రానికి చెందిన కార్మికులు సెలవుపై వెళ్తున్నారని, ఈ ప్రభావం ఎన్నికలు పూర్తయ్యే వరకు ఉంటుందని ఇంజినీర్లు అంచనా వేస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా పురోగతిలో ఉన్న పనులు నెమ్మదిస్తాయని, ఎన్నికల సమయంలో వేగంగా సాగవని ఇంజినీర్లు స్పష్టం చేస్తున్నారు. తెలంగాణలో స్థిరాస్తి ప్రాజెక్టుల్లో పనిచేసే కార్మికులు, ప్రభుత్వం చేపట్టే ప్రాజెక్టుల్లోని కూలీలు, జీహెచ్‌ఎంసీ చేపట్టిన పైవంతెనల నిర్మాణ పనుల్లోని కార్మికుల్లో ఛత్తీస్‌గఢ్ వాసులు చాలా వరకు ఉన్నారు. వారి రాష్ట్రంలోనూ అసెంబ్లీ ఎన్నికలు ఉండటం, దసరా రావడంతో వారు సొంత రాష్ట్రానికి వెళ్తున్నారు. అంతేకాదు.. నిర్మాణ పనులకు సంబంధించిన రవాణా వాహనాలు, వ్యక్తిగత వాహనాలు నిత్యం వందలాదిగా తిరుగుతుంటాయి. నగదు తీసుకెళ్తుంటారు. కూలీలు, ఇతరత్రా ఖర్చుల కోసం డబ్బు తీసుకెళ్లాల్సి ఉంటుందని, ఆయా వాహనాలను పోలీసులు తనిఖీ చేసి పట్టుకుంటే నష్టం వస్తుందన్న భావనతో గుత్తేదారులు సహజంగానే పనులపై పెద్దగా దృష్టి పెట్టరని అధికారులు అంటున్నారు. సహాయ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. ఆ కారణంతో ఎల్బీనగర్ నియోజకవర్గంలోని బైరామల్‌గూడ కూడలి పైవంతెన పురోగతి, శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని శిల్పాలేఅవుట్ రెండోదశ పైవంతెన నిర్మాణం, వేర్వేరు ప్రాంతాల్లో ఎస్‌ఎన్‌డీపీ కింద చేపట్టిన నాలాల నిర్మాణం, రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం, రహదారుల అభివృద్ధి, నిర్వహణ పనులపై ప్రభావం పడింది. హైదరాబాద్ రహదారుల అభివృద్ధి సంస్థ(హెచ్‌ఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో జరుగుతోన్న లింకు రోడ్ల నిర్మాణం దాదాపు నిలిచిపోయింది. మూసీపై వంతెనల నిర్మాణానికి ఇటీవలే కేటీఆర్ శంకుస్థాపన చేయగా ఆ పనులు ఎన్నికల తర్వాతే పట్టాలెక్కుతాయని అధికారులు తెలిపారు.

ఆత్మహత్యలు వద్దు..ఆత్మస్థైర్యం కోల్పోవద్దు

- రేవంత్‌రెడ్డి ట్వీట్

ప్రజావక్తి -హైదరాబాద్ బ్యూరో

'ఎన్నో అగ్ని పరీక్షలు ఎదుర్కొని ఇంత దూరం వచ్చినావు. మరికొంత ఆత్మస్థైర్యాన్ని కూడదీసుకోలేకపోయావా? నువ్వు కన్న కలల కోసం మరికొన్నాళ్లు వేచి ఉండలేకపోయావా? నిన్ను కన్నవారి కండ్లలో ఆనందం చూడాలన్న సంగతిని మరిచిపోయావా? ఎంతోమందికి దారి చూపాలనుకున్నావు. ఇలా అర్ధంతరంగా నీ ప్రయాణం ముగిస్తావా?' అంటూ టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ట్వీట్ చేశారు. 'యువతీ, యువకుల్లారా! ఆత్మహత్యలు వద్దు. మీ ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దు. మన భవిష్యత్తుతో చెలగాటం ఆడిన ఈ నక్కలు ఎక్కడ నక్కినా గుంజుకొచ్చి దోషులుగా నిలబెడదాం. వీళ్ళ నక్క జిత్తులను నడి రోడ్డులో నిలబెట్టి తరిమికొడదాం' అంటూ భరోసా ఇచ్చారు.

బతికి సాధిద్దాం :ఎంపి కోమటిరెడ్డి

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. 'అందరికీ ఉద్యోగాలిస్తామని నిరుద్యోగులారా..బతికి సాధిద్దాం...ఎవరూ ఆత్మహత్య చేసుకోవద్దు' అని విజ్ఞప్తి చేశారు. తల్లి తండ్రులకు కడుపుశోకం మిగల్చొద్దని ఒక ప్రకటనలో కోరారు. గ్రూప్ 2 వాయిదాతో వరంగల్‌కు చెందిన ప్రవళిక ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యనేనని ఆయన అభిప్రాయపడ్డారు.

నిస్సహాయతతోనే ప్రవళిక ఆత్మహత్య
రేణుక చౌదరి ఆవేదన

ఉద్యోగ నోటిఫికేషన్లు రాకపోవడంతోనే ప్రవళిక నిస్సహాయతకు గురై ఆత్మహత్య చేసుకున్నారని కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. ఖబర్దార్ కెసిఆర్ జాగ్రత్త అని హెచ్చరించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆమె విలేకర్లతో మాట్లాడారు. బంగారు తెలంగాణ అంటూ పిల్లల బతుకులు నాశనం చేస్తున్నారని సిఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టిపిఎస్‌పిఎస్‌పై సిబిఐ విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు.

ప్రవళికది ఆత్మహత్య కాదు ప్రభుత్వ హత్య
- చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

నిరుద్యోగ యువతి ప్రవళికది ఆత్మహత్య కాదు...ప్రభుత్వ హత్యేనని టిపిసిసి ఉపాధ్యక్షులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆత్మహత్య చేసుకోవడానికి కారణం ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. పరీక్షల తేదీలను నిర్ణయిస్తూ పదేపదే వాయిదాలు వేస్తూ పెట్టిన పరీక్షలకు పేపర్ లీకులు చేస్తూ రద్దు చేస్తూ...ఇలాగా అన్ని విషయాల్లో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు.

IN THE COURT OF THE HON'BLE
XI JUNIOR CIVIL JUDGE:
AT: SECUNDERABAD.
IN O.S.NO. 572 OF 20233

BETWEEN:-
Seema Vishnu Deo Mandal W/o Late. Venkata Uday Kumar Kuppa,Aged about: 52Years, Occ: Pvt Teacher, R/O. Flot no.202, Sushmi Residency Teacher's Colony, Near Kennedy Vidhya Bhaban School Nehrunagar, East Marredpally, Secunderabad.
...Plaintiff.
AND
1. The Mandal Revenue Officer, Balanagar Mandal, Medchal District.
2. The Branch Manager, ICICI Bank, Begumpet, Secunderabad.
3. All concerned.
... Defendants.

Please take notice that the plaintiff above named has filed the above suit for declaration declaring the plaintiff as legal heir of her deceased husband i.e. Late. Mr. Venkata Uday Kumar Kuppa . The said suit stands posted 20/10/2023 if any person/s is /are claiming to be the legal heirs of the said deceased Late. Venkata Uday Kumar Kuppa may appear before the said court on the said date and submit your contentions/ objections with documentary evidence, at 10:30 am either inperson or thought your Advocate failing which the matter will be heard and decide ex-part.

BY ORDER OF THE COURT

N. JANARDHAN REDDY
P. SAROJINI
10-3-64&65,G1/A, Jewel Residency,
Teachers colony, East Marredpally,
Secunderabad-500026.

రాజీనామా యోచనలో సింగిరెడ్డి దంపతులు!

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగలనున్నట్టు తెలుస్తోంది. ఎఎస్ రావునగర్ కార్పొరేటర్ శిరీష సోమశేఖర్ రెడ్డి, ఉప్పల్ బీ బ్లాక్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి ఆదివారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయనున్నట్టు సమాచారం. టిపిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డికి సోమశేఖర్ రెడ్డి ముఖ్య అనుచరుడిగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో సోమశేఖర్‌రెడ్డి ఉప్పల్ ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. అయితే టికెట్ రాదని తెలియడంతో మనస్తాపానికి గురైన ఆయన, సింగిరెడ్డి భార్య.. కార్పొరేటర్ శిరీష రాజీనామా చేస్తున్నట్టు తెలిసింది.

అమరులకు నివాళ్లులర్పించిన టిజెఎస్ నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెత్తరమాస సందర్భంగా తెలంగాణ అమరవీరులకు టిజెఎస్ నాయకులు నివాళు లర్పించారు. ప్రతీ సంవత్సరం పెత్తరమాస రోజున తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారిని స్మరించుకుంటూ గన్‌పార్క్ మృతవీరుల స్థూపం వద్ద బియ్యమిచ్చే సాంప్రదాయాన్ని టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం చేపడుతున్న సంగతి తెలిసిందే. అయితే సడక్ బంద్ నేపథ్యంలో ఆయన గృహ నిర్బంధం చేయడంతో ఇంటివద్దనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడి పదేండ్లు గడిచినా ఆత్మహత్యలు ఆగకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

బిసిలకు సముచిత స్థానాలివ్వాలి

జాజుల శ్రీనివాస్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ ప్రకటించిన 115 మంది అభ్యర్థుల జాబితాలో మార్పులు చేసి బిసిలకు సముచిత స్థానాలు కేటాయించాలనీ లేని పక్షంలో బిఆర్ఎస్ జాతకాన్ని మార్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాసగౌడ్ హెచ్చరించారు. శనివారం హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ' బిసి మేనిఫెస్టో-2023ను విడుదల చేశారు. సాధారణ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బిసిల జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బిసిలు సామాజిక, రాజకీయ, ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం బాగుపడుతుందని తెలిపారు. 60శాతం జనాభాకు బడ్జెట్‌లో మూడు శాతం నిధులు కేటాయించటమేంటని ప్రశ్నించారు. 2014 ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తరపున బిసిలకు 28 టికెట్లు ఇచ్చారనీ, ఆ తరువాత 2018లో 26, ఈ సారి 23 మందికే టికెట్లు ఇచ్చారనీ,.. ఇది ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. 10 శాతంగా ఉన్న అగ్రకులాలకు 61 స్థానాలు, 60శాతం ఉన్న బిసిలకు 23 టికెట్లు కేటాయించడమేమిటని ప్రశ్నించారు. సమావేశంలో కుందారపు గణేశ్‌చారి, దుర్గయ్యగౌడ్, గోపి, శ్రీనివాస్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు పారిశుధ్య కార్మికులు దుర్మరణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బతుకమ్మ పండుగ ఏర్పాట్లలో భాగంగా చెత్తను తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు ముగ్గురు పారిశుధ్య కార్మికులు చెరువులో జారిపడ్డారు. గజ ఈతగాళ్ల గాలింపు చేపట్టగా ఒకరి మృతదేహం లభ్యమైంది. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తీగుల్ గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

గ్రామానికి చెందిన బాబు(25), గిరిపల్లి భారతి(40), ఏళ్లం యాదమ్మ(43) ముగ్గురూ పారిశుధ్య కార్మికులు. శనివారం పటేల్‌చెరువు వద్ద పిచ్చి మొక్కలను తొలగిస్తుండగా.. ప్రమాదవశాత్తు ఘాట్ మెట్లపై నుంచి జారి చెరువులో పడి గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ భాను ప్రకాశ్‌రావు పోలీసులకు సమాచారం అందించారు. గజ ఈతగాళ్ల సాయంతో ఒకరి మృతదేహాన్ని వెలికితీశారు. మిగతా ఇద్దరి కోసం గాలింపు చర్యలు సాగుతున్నాయి. ఆటపాటలతో సంతోషంగా సాగాల్సిన పండుగ పూట గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

'ఉపాధి'కి మంగళం

- 'ఎన్‌ఆర్‌ఇజిఎ'ను నీరు గారుస్తున్న కేంద్రం
- తెలంగాణపై మరింత వివక్ష
- జాబ్‌కార్డుల జారీలో 8 శాతం తగ్గుదల
- ఏడాదిలో ఏడు లక్షల మంది దూరం
- 17.3 లక్షల మంది కార్మికుల తొలగింపు
- 17.9 శాతం మేర తగ్గిన పనిదినాలు
- 2021-22తో పోలిస్తే 29.3 శాతం తగ్గుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రం నీరుగారుస్తున్నది. బడుగు, బలహీన వర్గాలకు ఇతోధికంగా దోహదపడుతున్న ఆ చట్టం నిర్వీర్యానికి కంకణం కట్టుకుని ముందుకు సాగుతున్నది. తెలంగాణ విషయంలో మరింత కక్షపూరితంగా వ్యవహరిస్తున్నది. రెండేండ్లలో 30 శాతం మేర పనిదినాలు తగ్గడమే దానికి సాక్షీభూతంగా నిలుస్తున్నది. పొమ్మనకుండా పొగపెడుతూ కార్మికులను పనులకు దూరం చేస్తున్నది. ఏ సామాజిక తరగతుల్లో ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చాలని చట్టం తీసుకొచ్చారో ఆ లక్ష్యంగా క్రమంగా నీరుగారిపోతున్నది. కేంద్రం తీరు వల్ల ఎక్కువగా నష్టపోతున్నది ఎస్‌సి, ఎస్‌టి సామాజిక తరగతుల వారే కావడం ఆందోళనకు గురిచేస్తున్నది. ప్రభుత్వ గణాంకాలు, క్షేత్రస్థాయి అధ్యయనం ఆధారంగా లిబ్‌టెక్ ఇండియా సంస్థ రూపొందించిన రిపోర్టు చట్టం నిర్వీర్యం అవుతున్న తీరును ఎత్తిచూపింది.

తెలంగాణలో ఉపాధి హామీ చట్టం 32 జిల్లాల్లోని 540 మండలాల్లో అమలవుతున్నది. ఒక్కో కుటుంబానికి రాష్ట్రంలో సగటున 37.56 రోజుల పనిదినాలే దక్కుతున్నాయి. ఇది జాతీయ స్థాయి సగటు కంటే తక్కువ. జాతీయ స్థాయిలో సగటున 38.43 రోజుల పనిదొరుకుతున్నది. వంద రోజుల పని పూర్తి చేసిన కుటుంబాల సంఖ్య దేశ వ్యాప్తంగా 6.79 లక్షల కుటుంబాలు కాగా, తెలంగాణలో ఆ సంఖ్య కేవలం 0.14 లక్షలు మాత్రమే ఉంది. జాతీయ స్థాయిలో ఒక వ్యక్తికి సగటు వేతనం రోజుకు రూ.237.65 దక్కుతుండగా అది తెలంగాణలో రూ.179 మాత్రమే.

జాబ్ కార్డుల్లో కోత

రాష్ట్రమంతటా 2022-23 ఆర్థిక సంవత్సరంలో 57.5 లక్షల జాబుకార్డులుండగా 2023-24కు వచ్చేసరికి అదికాస్తా 52.92 లక్షలకు పడిపోయింది. అందులో క్రియాశీలక జాబ్‌కార్డులు 35.28 లక్షలు మాత్రమే. క్రియాశీల కార్మికులు 2022 అక్టోబర్ నాటికి 67.3 లక్షల మంది ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 60.77 లక్షలకు తగ్గింది. అంటే క్రియాశీలక కార్మికుల సంఖ్య 9.7 శాతం, జాబ్ కార్డుల సంఖ్య 8 శాతం మేర తగ్గాయి. జాతీయ స్థాయిలో ఇది 12.3 శాతముంది.

జాతీయస్థాయిలో పెరుగుదల..రాష్ట్రంలో తగ్గుదల

తెలంగాణలో ఎంజీఎన్‌ఆర్‌ఐఈజీఏ కార్మికులకు ఈ ఏడాది 8.14 కోట్ల పనిదినాలే కల్పించబడ్డాయి. మునుపటి సంవత్సరం 9.92 కోట్ల పనిదినాలు నమోదయ్యాయి. పనిదినాల కల్పనలో గతేడాదితో పోల్చి చూస్తే 17.9 శాతం క్షీణత ఉంది. అదే 2021-22 ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూస్తే పనిదినాల్లో కోత 29.3 శాతం మేర ఉంది. అంటే రెండేండ్ల వ్యవధిలో మూడింట ఒకొంతు మేర పనిదినాల సంఖ్య కుదించబడింది. అదే జాతీయ స్థాయిలోనూ ఇదే క్రమం కొనసాగుతున్నా గతేడాదితో పోల్చి చూస్తే మాత్రం పనిదినాల కల్పన మెరుగైంది. 2021-23 పోల్చి చూస్తే ఉపాధి పొందిన కుటుంబాల సంఖ్య 13.5 శాతం పెరిగింది. అదే తెలంగాణలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు కేవలం మూడు జిల్లాల్లో మినహా (జగిత్యాల, నల్లగొండ, సంగారెడ్డి) మిగతా 29 జిల్లాల్లో క్షీణత ఉంది. ములుగు జిల్లాలో అత్యధికంగా 51.2 శాతం, మేడ్చల్ జిల్లాలో 51.1 శాతం, కామారెడ్డి జిల్లాలో 47.5 శాతం మేర పనిదినాల్లో కోత పడింది.

కార్మికుల తొలగింపు

2022-23 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా జాబ్‌కార్డుల నుంచి కార్మికులు గణనీయ సంఖ్యలో తొలగించబడ్డారు. దేశ వ్యాప్తంగా 2022-23లో 5.2 కోట్ల మంది ఉపాధి కార్మికులను జాబ్‌కార్డుల నుంచి తొలగించినట్టు లోక్‌సభకు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నివేదిక అందజేసింది. తెలంగాణలో 17.3 లక్షల మంది కార్మికులు తొలగింపునకు గురయ్యారు. ఈ తొలగింపులు పారదర్శకంగా జరగలేదనే విమర్శ బలంగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ (ఏప్రిల్ నుంచి సెప్టెంబర్) ఉపాధి హామీ చట్టంలో కొత్తగా 1,34,487 మంది కార్మికులు చేరారు. అయితే, గత ఆరు నెలల్లో 1,20,281 మంది కార్మికులు తొలగించబడ్డారు. దీంతో కొత్తగా చేరిన కార్మికుల సంఖ్య 14,206 మాత్రమే. దీంతో గతేడాది తొలగించిన కార్మికుల్లో నిజమైన కార్మికులందరి భవితవ్యం చిక్కుల్లో పడింది.

వివిధ సామాజిక తరగతుల భాగస్వామ్యం ఇలా

సకాలంలో వేతనాలు అందకపోవడం, కేంద్రం రోజుకో కొత్తరకం ఆంక్షలు తెస్తుండటంతో ఆయా సామాజిక తరగతుల వారు ఉపాధి :హామీ పనులకు క్రమంగా దూరమవుతున్నారనే విషయం లిబ్‌టెక్ రిపోర్టు ఆధారంగా స్పష్టంగా అర్థమవుతున్నది. గతేడాదితో పోలిస్తే ఈసారి ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన వారు 16.5 శాతం, ఎస్‌టిలు 16.6 శాతం మేర పని దినాలను కోల్పోయారు. ఇతర సామాజిక తరగతుల్లో పనిదినాల సంఖ్య తగ్గుదల 18.9 శాతం తగ్గుదల ఉంది. మొత్తంగా తెలంగాణలో 17.9 శాతం మేర పనిదినాలు తగ్గాయి.

బడ్జెట్‌లోనూ కోత

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఏటేటా నిధులను తగ్గిస్తూ పోతున్నది. కేంద్రం ఈసారి బడ్జెట్‌లో కేవలం రూ.60 వేల కోట్లను మాత్రమే కేటాయించింది. దీనివల్ల తెలంగాణకు అందే నిధుల్లో భారీగా కోతపడుతున్నది. వాస్తవానికి దేశవ్యాప్తంగా ఉపాధి :హామీ చట్టం ద్వారా ఎక్కువ పనులు చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా ఉంది. కేంద్రం తీరు వల్ల రాష్ట్ర ప్రజలు నష్టపోతున్నారు. డిమాండ్ రీత్యా తెలంగాణకు 12 కోట్ల పనిదినాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం ఓ పక్క కోరుతుండగా కేంద్రం మాత్రం నిధులను తగ్గిస్తూ పోతున్నది. 2020-21లో తెలంగాణకు రూ.4,163 కోట్లను కేంద్రం కేటాయించింది. 2022-23కు వచ్చే సరికి దాదాపు సగానికి కుదించింది. సుమారుగా 2,600 కోట్లు మాత్రమే విదిల్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఉపాధి కూలీల కోసం రూ.1459 కోట్లను మాత్రమే విడుదల చేసింది.

నిర్బంధం దురదృష్టకరం

- అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలి : కోదండరాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అఖిలపక్షం ఇచ్చిన సడక్ బంద్‌పై నిర్బంధం విధించడం దురదృష్టకరమని టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ ఖండించారు. అరెస్టు చేసిన అఖిలపక్ష, విద్యార్థి, యువజన నాయకులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం సడక్ బంద్ నేపథ్యంలో ప్రొఫెసర్ కోదండరామ్‌ను హైదరాబాద్‌లోని తార్నాకలో గృహ నిర్బంధం విధించారు. ఈ నేపథ్యంలో ఉదయం ఆరు గంటల నుంచే పోలీసులు అఖిలపక్ష నేతలు కోదండరామ్ ఇంటికి చేరుకోగా అక్కడే పోలీసులు ఆపివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, టిజెఎస్, బిఎస్‌పి, సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ, సిపిఐఎం ప్రజాపంథా, సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీల సడక్ బంద్‌కు పిలుపునిచ్చాయని గుర్తుచేశారు. అసమర్థ సిఎం కెసిఆర్ వల్లే రాష్ట్రంలో ఈ పరిస్థితి దాపురించిందని ఆయన విమర్శించారు. ఉద్యోగ పరీక్షలను సక్రమంగా నిర్వహించలేని టిఎస్‌పిఎస్‌సిని ఎందుకు రద్దు చేయడం లేదో, దోషులను ఎందుకు నిగ్గు తేల్చడం లేదో సిఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అఖిల పక్ష నేతలు గోవర్ధన్, అరుణ, చలపతి రావు,సర్దార్ వినోద్ కుమార్, సలీం పాషా, నర్సయ్య, శ్రీధర్, ఆశప్ప, మోహన్ రెడ్డి, తుల్జ రెడ్డి, అరున్ కుమార్, ఆంజనేయులు, రవి కంత్, శ్రీనివాస్, నరహరి, అంజి గౌడ్, రమణ పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాల భర్తీ

పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భావోద్వేగంతో నిరుద్యోగ యువత ప్రాణాలు తీసుకోవద్దని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి తెలిపారు. శనివారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రెండు నెలలు ఓపిక పట్టాలని యువతను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని ధ్వజమెత్తారు. డిసెంబరు 9 నుంచి యువత జీవితాల్లో వెలుగులు తెస్తామన్నారు. "నిరుద్యోగ యువత ఆత్మహత్యలు ఉండకూడదంటే కెసిఆర్ గద్దె దిగాలి. 32 లక్షల మంది యువత ఆందోళనలో ఉన్నారు. జిరాక్స్ సెంటర్లలో ప్రశ్నపత్రాలు అమ్మడం పూర్తిగా ప్రభుత్వ వైఫల్యం కాదా? సింగరేణిలో నియామకాల విషయంలోనూ సరిగా వ్యవహరించలేదు. గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షల రద్దుతో అనేకమంది ఆత్మహత్య చేసుకున్నారు. జరిగిన పరిణామాలకు టిఎస్‌పిఎస్‌సి అధికారులను బాధ్యులను చేయడం లేదు. పోటీ పరీక్షలు రాసే విద్యార్థిని శుక్రవారం హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకుంటే.. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు మరో విధంగా ప్రచారం చేస్తున్నారు. విద్యార్థిని రాసిన లేఖలోనే ఆత్మహత్యకు కారణం స్పష్టంగా పేర్కొంది. చనిపోయిన విద్యార్థినిపై అబాండాలు వేయడం సరికాదు. విద్యార్థులు, నిరుద్యోగులకు కాంగ్రెస్ అండగా ఉంటుంది. అన్ని సమస్యలకు పరిష్కారం కెసిఆర్ గద్దె దిగడమే. తెలంగాణలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పర్యటన వివరాలు ఆదివారం చెబుతాం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

టిఎస్‌పిఎస్‌సిపై చర్యలు తీసుకోవాలి

- రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో సడక్ బంద్
- ఖమ్మం, భువనగిరిలో నేతల అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్‌పిఎస్‌సిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా శనివారం రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సడక్ బంద్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వాకం వల్ల గ్రూప్ పరీక్షలు రద్దు కావడంతో నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని నాయకులు తెలిపారు. వారి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యలకు కారణమవుతోందన్నారు. ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డుపై అఖిల పక్ష పార్టీల నేతలు బైఠాయించి వాహన రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు బాగం హేమంతరావు, ప్రజాపంథా నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ఉన్నారు. తిరుమలాయపాలెంలో ఖమ్మం - వరంగల్ హైవేపై సిపిఎం, కాంగ్రెస్ నాయకులు బైఠాయించి నిరసన తెలిపారు. టిఎస్‌పీఎస్‌సి ప్రస్తుత బోర్డు చైర్మన్ సహా సభ్యులను తొలగించాలని సిపిఎం సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో హైటెక్ బస్టాండ్ ఎదురుగా అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై (సడక్ బంద్) రాస్తారోకో నిర్వహించారు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో సడక్ బంద్ నిర్వహించారు. ఈ క్రమంలో ముందునే పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ అరెస్టులను సిపిఐ, సిపిఐ ఎంఎల్, కాంగ్రెస్ పార్టీలో తీవ్రంగా ఖండించాయి. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు వస్తువుల అభిలాష్ తదితరులను అరెస్టు చేశారు.

దూసుకొచ్చిన ప్రమాదం

డిసిఎం ఢీకొనడంతో నలుగురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పండుగకు సంతోషంగా ఇళ్లకు బయలుదేరిన వారిని ప్రమాదం వెంటాడింది. ఒక ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డామని ఊపిరి పీల్చుకునేలోగానే మరో ప్రమాదం దూసుకొచ్చింది. బస్సులో నుంచి దిగుతున్న వారిపై నుంచి డిసిఎం వేగంగా వెళ్లడంతో నలుగురు మృతి చెందారు. వాహనం వేగానికి శరీర భాగాలు నుజ్జునుజ్జు అయ్యాయి. మృతులంతా యూపీకి చెందిన వారుగా పోలీసులు తెలిపారు. ఈ ఘోర ప్రమాదం నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రయాన్‌పల్లిలో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు, ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారి 44పై శుక్రవారం రాత్రి వరి కోత యంత్రం రోడ్డుపై ఆగిపోగా వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఇదే సమయంలో యూపీ వైపు వెళ్తున్న బస్సు, ఓ లారీ ఢీ కొన్నాయి. కానీ ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదు. దాంతో బస్సులో ఉన్న వారంతా ఒక్కొక్కరుగా కిందకు దిగుతున్నారు. అదే సమయంలో వెనుకాల నుంచి వేగంగా వచ్చిన డీసీఎం వారిపై నుంచి దూసుకెళ్లింది. రెప్పపాటులో జరిగిన దారుణ ఘటనతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు ఆస్పత్రిలో చనిపోయారు. మృతులు ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చెందిన ప్రదీప్(20), జీతు (32), దుర్గేష్ ప్రసాద్(19), జ్ఞానేష్(22)గా గుర్తించారు. వీరంతా హైదరాబాద్‌లో పనులు చేస్తుండేవారు. పండుగ సమయం కావడం.. సెలవులు ఉండటంతో నలుగురు కలిసి స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదంలో ప్రాణం కోల్పోయారు. పోలీసులు, ఇందల్‌వాయి టోల్‌ప్లాజా సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

మేడ్చల్‌లో రోడ్డు ప్రమాదం

మేడ్చల్ జిల్లా శామీర్ పేటలోని ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శనివారం ఉదయం ఓఆర్ఆర్‌పై వేగంగా వచ్చిన ఇనోవా కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న లారీని వెనుకను నుంచి ఢీ కొట్టింది. కీసర నుంచి మేడ్చల్ వైపు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో ఇనోవా వాహనంలో ప్రయాణిస్తున్న వారిలో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న శామీర్ పేట పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ముగ్గురు మావోయిస్టు కొరియర్లు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం పట్టణంలో ముగ్గురు మావోయిస్టు కొరియర్లు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి భారీగా పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను శనివారం భద్రాచలం ఎఎస్‌పి పరితోశ్ పంకజ్ విలేకరులకు వెల్లడించారు.

శనివారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో భద్రాచలం పట్టణ ఎస్‌ఐ, పోలీసులు స్థానిక ఆర్టీసి బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా 7వ నెంబర్ ఫ్లాట్‌ఫారం వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా చర్ల మండలం నాయకులకొత్తూరు గ్రామానికి చెందిన గుంజి విజయ్, హన్మకొండ జిల్లా భీందేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన బొంత నవీన్, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం బడితండాకు చెందిన భూక్యా నవీన్‌గా గుర్తించారు. విజయ్ ఐదేళ్లుగా మావోయిస్టులకు కొరియర్‌గా పనిచేస్తూ వారికి పేలుడు పదార్థాలను సరఫరా చేస్తున్నాడు. కాగా.. నవీన్ పేలుడు పదార్థాల దుకాణ యజమాని. నవీన్ మహబూబాబాద్ జిల్లా శనిగాపురంలో తిరుమల ఏజెన్సీ పేరుతో పేలుడు పదార్థాలను విక్రయిస్తున్నాడు. గతంలో కూడా విజయ్‌కు పేలుడు పదార్థాలను విక్రయించాడు. వాటిని విజయ్ మావోయిస్టులకు అందజేశాడు. మళ్లీ వారితో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతానికి వెళ్లేందుకు భద్రాచలం బస్టాండ్‌లో వేచి ఉన్న క్రమంలో పోలీసులకు పట్టుబడినట్లు ఎఎస్‌పి పేర్కొన్నారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

బి ఫార్మసీ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంచి చదువులు చదివి, ఉన్నత స్థానంలో స్థిరపడి, కుటుంబానికి అండగా ఉంటాడని భావించిన తల్లిదండ్రుల ఆశలను అడియాశలు చేశాడు కొడుకు.. ఏ సమస్య వచ్చిందో కానీ బి ఫార్మసీ చదువుతున్న విద్యార్థి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా గోకుల్‌తండాలో విషాదం నింపింది. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గోకుల్ తాండాకు చెందిన బాదావత్ లక్ష్మి- మోహన్‌కు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశం వెళ్ళగా, రెండో కొడుకు బాదావత్ అనిల్(18) ఖమ్మంలో బీ ఫార్మసీ చదువుతున్నారు. దసరా సెలవులకు ఇంటికి వస్తున్నానని, రంగంపేట్ రావాలని తండ్రికి ఫోన్‌లో సమాచారం అందించారు. తండ్రి రంగంపేటకు వెళ్లేసరికి, అనిల్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలో చెల్లాచెదురైన కొడుకు శరీర భాగాలను చూసి తల్లిదండ్రులు, కుటుంబికులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. కాగా అనిల్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

గ్రూప్-2 రద్దు చేయాలని రేవంత్ రెడ్డి కోరలేదా?

కల్వకుంట్ల కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-2 రద్దు చేయాలని పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి కోరలేదా? అని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. ఈ మేరకు ఆమె శనివారం ట్వీట్ చేశారు. శవాల మీద పేలాలు ఏరుకోవడం రేవంత్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. రేవంత్ ఆవేదన బూటకం... కాంగ్రెస్ ఆందోళన నాటకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రవళిక ఆత్మహత్య పట్ల ఆమె విచారం వ్యక్తం చేశారు. ఏ తల్లిదండ్రులకు ఇలాంటి పరిస్థితి రావద్దన్నారు. గ్రూప్-2 వాయిదా వేయాలని రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారని ఆమె గుర్తు చేశారు. కాంగ్రెస్ కుట్రలను బద్దలు కొట్టి లక్షలాది ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత కెసిఆర్‌దని ఆమె తెలిపారు. బతుకమ్మను కించపరచడం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఎద్దేవా చేశారు. తమకు బతుకమ్మ చేయడం తెలుసు. బాధలను పంచుకోవడం తెలుసని కవిత స్పష్టం చేశారు. ఆడబిడ్డ ఆత్మహత్య చేసుకుంటే సానుభూతి వ్యక్తం చేయడం పోయి రాజకీయం చేయడం కాంగ్రెస్ విధానమా? అని ఆమె ప్రశ్నించారు.

బతుకమ్మ పాట పాడిన ఎమ్మెల్సీ కవిత

ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై తొమ్మిది రోజుల పాటు తీరొక్క పూలతో ఘనంగా జరుపుకొనే పండుగ సందర్భంగా ఆడబిడ్డలందరికీ ఎమ్మెల్సీ కవిత శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మన ఆడబిడ్డల ఆత్మీయ సంగమం, తెలంగాణ ఆత్మగౌరవ సంబరం బతుకమ్మ అన్నారు. ఈ నేపథ్యంలో భారత జాగృతి రూపొందించిన బతుకమ్మ పాటల ఆల్బమ్‌ను కవిత విడుదల చేశారు. మొత్తం 10 పాటలున్న ఈ ఆల్బమ్ యూట్యూబ్‌లో అందుబాటులో ఉంచారు. ఇందులో ఒక పాటకు ఎమ్మెల్సీ కవిత కోరస్ ఇవ్వడం విశేషం.

'లెట్స్ మెట్రో ఫర్ సిబిఎన్' ఉద్రిక్తత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు మద్దతుగా హైదరాబాద్‌లో ఐటి ఉద్యోగులు, చంద్రబాబు అభిమానులు శనివారం మెట్రో స్టేషన్‌ల వద్ద 'లెట్స్ మెట్రో ఫర్ సిబిఎన్' కార్యక్రమం నిర్వహించారు. మియాపూర్ నుంచి ఎల్బీనగర్ వరకూ నల్ల టీషర్టులు ధరించి మెట్రోలో ప్రయాణించి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మెట్రో స్టేషన్ల ప్రవేశాల వద్ద బందోబస్తు నిర్వహించి నల్ల చొక్కాలు ధరించిన వారిని లోనికి అనుమతించలేదు. ఈ క్రమంలో మియాపూర్, మలక్‌పేట్ మెట్రో స్టేషన్ సహా అమీర్‌పేట్‌లో మెట్ల దారిని మధ్యాహ్నం వరకు తాత్కాలికంగా మూసివేశారు. ఆ తర్వాత ప్రయాణికులను అనుమతించారు. మరోవైపు ఎల్బీనగర్ మెట్రోస్టేషన్ వద్ద నల్ల టీషర్ట్ వేసుకొని వచ్చిన యువకులను పోలీసులు అడ్డుకున్నారు. 'వి వాంట్ జస్టిస్' అంటూ వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. చంద్రబాబుకు మద్దతుగా మియాపూర్ మెట్రోస్టేషన్ వద్ద ఐటి ఉద్యోగులతో కలిసి తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి నిరసన తెలిపారు. చంద్రబాబు ప్రాణానికి ముప్పు ఉందని.. అందువల్లే ఒక ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా కార్యక్రమానికి వచ్చినట్లు ఆమె తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సిఎం జగన్ అరాచకాన్ని తెలంగాణ సహా అన్ని ప్రాంతాల్లో ప్రజలంతా ఖండిస్తున్నారని తెలిపారు. కాగా, మియాపూర్ నుంచి ఎల్బీనగర్ వచ్చిన ఐటి ఉద్యోగులు తిరిగి వెళ్లేందుకు యత్నించగా.. టికెట్ ఇవ్వకుండా పోలీసులు, మెట్రో సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. బస్సుల్లో వెళ్లాలంటూ ఐటి ఉద్యోగులకు పోలీసులు సూచించారు. అయితే మెట్రోలోనే వెళ్తామంటూ ఎల్బీనగర్ వద్ద ఐటి ఉద్యోగులు నిరసనకు దిగారు. దీంతో.. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. నిరసనకారులకు మద్దతు తెలిపిన ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని కాసేపటి తర్వాత వదిలిపెట్టారు.

కిష్టయ్య కుటుంబానికి కెసిఆర్ అండ

కుమార్తె ఉన్నత చదువులకు సాయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన కూతురును డాక్టర్ చేయాలని తెలంగాణ అమరుడు పోలీసు కానిస్టేబుల్ కిష్టయ్య కన్న కలలను సిఎం కెసిఆర్ ఇప్పటికే నిజం చేశారు. ఇప్పుడు పిజి చదించేందుకు ముందుకు వచ్చిన ముఖ్యమంత్రి అమరుల కుటుంబాల పట్ల ఆయనకున్న అభిమానాన్ని మరోసారి చాటుకున్నారు.

ఇప్పటికే తమ కుటుంబానికి అండగా నిలబడిన సీఎం కేసీఆర్ ఇప్పుడు తన కూతురు ప్రియాంకను పిజి చదివిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని కానిస్టేబుల్ కిష్టయ్య భార్య పద్మావతి సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, శనివారం కరీంనగర్‌లోని చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాలలో ప్రియాంక పీజీలో అడ్మిషన్ పొందారు.కెసిఆరే తన ఫీజు చెల్లిస్తానని చెప్పారని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఎంబిబిఎస్ పూర్తి చేసి కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి బస్తీ దవాఖానలో వైద్యురాలిగా సేవలు అందిస్తున్న ప్రియాంక పీజీలో గైనకాలజిస్టయినా, జనరల్ సర్జన్ అయినా చేయాలని అనుకున్నారు. ఇదే విషయాన్ని హైదరాబాద్‌లో జరిగిన అమరజ్యోతి ఆవిష్కరణ సమయంలో తన తల్లి పద్మావతితో కలిసి సీఎం కెసిఆర్‌ను కలిసినప్పుడు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సీటు సంపాదించుకుంటే తప్పకుండా చదివిస్తానని సిఎం కెసిఆర్ ప్రియాంకకు హామీ ఇచ్చారు. అప్పటికే నీట్‌లో పీజీ ఎంట్రెన్స్ రాసిన ప్రియాంకకు బీ కేటగిరీ మేనేజ్‌మెంట్ కోటాలో జనరల్ సర్జన్ సీటు వచ్చింది. ఈ విషయాన్ని రాజ్యసభ సభ్యులు సంతోష్‌కుమార్‌కు తెలుపడంతో ఆయన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రియాంక పీజీ చదివేందుకు ఖర్చయ్యే రూ. 24 లక్షలు చెల్లించేందుకు సీఎం కెసిఆర్ అంగీకరించడంతో శనివారం కరీంనగర్‌లోని చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాలలో పీజీలో అడ్మిషన్ పొందారు.

చంద్రబాబు అరెస్టు బాధేసింది : మంత్రి మల్లారెడ్డి

తెదేపా అధినేత చంద్రబాబు అరెస్టుపై తెలంగాణ మంత్రి మల్లారెడ్డి తీవ్రంగా స్పందించారు. 45 ఏళ్ల రాజకీయ చరిత్ర.. 14 ఏళ్లు సీఎంగా చేసిన వ్యక్తిని జైలులో పెడతారా?అని మండిపడ్డారు. ఆయన ఏం పాపం చేశారని జైలులో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఎవరినీ మోసం చేయలేదు.. ఎఫ్‌ఐఆర్‌లో ఆయన పేరు లేకపోయినా ఎలా అరెస్టు చేస్తారంటూ నిలదీశారు. దేశంలోనే ది బెస్ట్ సీఎంగా చంద్రబాబు పేరు తెచ్చుకున్నారని మంత్రి మల్లారెడ్డి కొనియాడారు. అలాంటి వ్యక్తిని జైలులో పెట్టి ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు.